క్లుప్తంగా

నేత్రదానం

తిరువూరు: స్థానిక పాతతిరువూరులో సోమవారం రాత్రి మృతిచెందిన రావి అనసూయ(85) నేత్రాలను ఆమె కుటుంబసభ్యులు ఖమ్మంలోని నేత్రనిధి ట్రస్టుకు వితరణ ఇచ్చారు. తిరువూరు లయన్స్ క్లబ్ సభ్యుల ప్రోత్సాహంతో అనసూయ కుమార్తెలు పుష్పావతి, సత్యవతి, మంగతాయారు, పద్మావతి నేత్రదానానికి అంగీకరించారు. లయన్స్ సభ్యులు సుబ్రహ్మణ్యేశ్వరరావు,రాజేష్‌ఖన్నా పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో పుణ్యతిథి కార్యక్రమం



ఆగిరిపల్లి: స్థానిక విజయవాడ రోడ్‌లో ఉన్న సాయిబాబా మందిరంలో 105వ పుణ్యతిథి, మహా సమాధి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా సాయిబాబాకు విబూదితో అభిషేకం, భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పుష్పాలతో మహాసమాధి కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విద్యార్థులకు పతకాలు



ఆగిరిపల్లి: కోయంబత్తూర్‌లో జరిగిన సీబీఎస్‌ఈ సౌత్ జోన్ చాంపియన్ షిప్ పోటీలలో మండలంలోని తోటపల్లి హీల్ స్కూల్‌కి చెందిన బాలుర అండర్–14 కేటగిరీలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.సాయిబాబు మంగళవారం తెలిపారు. అలాగే బాలికలు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా నవంబర్ 16 నుంచి 19 వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే అంతర్జాతీయ యోగా పోటీల్లో పాల్గొనేందుకు ఐదుగురు హీల్ విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్, సీఈఓ కూరపాటి అజయ్ బాబు అభినందించారు.

తాగునీటి ట్యాంకర్ వితరణ



అక్కపాలెం(తిరువూరురూరల్): మండలంలోని అక్కపాలెం కోదండరామాలయానికి గ్రామానికి చెందిన పదిలం రాములు కుటుంబసభ్యులు రూ.2.50 లక్షల విలువైన తాగునీటి ట్యాంకర్‌ను వితరణఇచ్చారు.రాములు భార్య రాజ్యం, కుమారులు కృష్ణ, ఏసు, సత్యం ఈ ట్యాంకర్‌ను గ్రామ మాజీ సర్పంచ్ పర్వతనేని జగన్‌మోహన్, నాగిరెడ్డిల సమక్షంలోఆలయ కమిటీకి అందజేశారు.

రైలు ఢీకొని 5 గేదెల మృతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి రైల్వేట్రాక్‌పై వెళుతున్న ఐదు గేదెలను రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదు గేదలు మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. కొండపల్లికి చెందిన ఓ వ్యక్తి తన పాడిగేదలను మేతకోసం ఉదయం పొలం తోలాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చే సమయంలో రైల్వేట్రాక్ దాటుతుండగా ఎన్టీటీపీఎస్ బొగ్గు రవాణాకు ఉపయోగించే రైల్వే గేటు సమీపంలో రైలు ఢీకొట్టింది. రైల్వే ట్రాక్‌పై సుమారు 500 మీటర్ల దూరం చెల్లాచెదురుగా పడిన గేదెలను రైల్వే పోలీసులు తొలగించారు.

అంబరాన్నంటిన దసరా సంబరాలు

అంధ్రా మైసూర్‌గా పేరుగాంచిన నూజివీడులో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. విచిత్ర వేషధారణలు, కోలాట నృత్య ప్రదర్శనలు, బుట్టబొమ్మల సందడి, కేరళ చండే నృత్యవాయిద్యాలు, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు కొనసాగింది. మహిషమ్మను పట్టణ ప్రజలు కనులారా దర్శించుకున్నారు.

నూజివీడు: దసరా వేడుకలు నూజివీడులో సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. స్థానిక ఉయ్యూరు ఎస్టేట్‌లో జమిందారీ వారసుడైన ఎంఎంఆర్‌పీ అప్పారావుతో పాటు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మెహర్ అప్పారావు తుపాకి పేల్చి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. అక్కడ నుంచి ప్రారంభమైన ఊరేగింపు కోట మహిషాసురమర్దిని ఆలయం వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి పట్టణంలోని ప్రధాన రహదారుల్లో తెల్లవార్లు సాగింది. స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షుడు రామిశెట్టి మురళీకృష్ణ, ఫెస్టివల్ కమిటీ సెక్రటరీ పగడాల సత్యనారాయణ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. అర్థరాత్రి 11 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు మంగళవారం తెల్లవారిన తరువాత ఏడు గంటల వరకు కొనసాగింది. ఊరేగింపును తిలకించేందుకు వచ్చిన జనంతో రోడ్లన్నీ కిటకిటలాడాయి.

పోటెత్తిన భక్తజనం

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక కోట మహిషాసుర మర్దనీ అమ్మవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకూ క్యూలు కిక్కిరిశాయి. అమ్మవారు శ్రీ మహిషాసురమర్దిని,, శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చింది. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్ దంపతులతో పాటు పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, రూరల్ సీఐ పీ బాలసురేష్‌బాబు అమ్మవారి ఆలయ ఆవరణలో జమ్మి చెట్టుకు ఆయుధ పూజ నిర్వహించారు. పట్టణ సీఐ మూర్తి, రూరల్ సీఐ బాలసురేష్‌బాబు నేతృత్వంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ముగిసిన లక్ష కుంకుమార్చన

గంపలగూడెం: దసరా సందర్భంగా గంపలగూడెం గాంధీ సెంటర్లో ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శరన్నవ రాత్రి పందిరిలో చేపట్టిన లక్ష కుంకుమార్చన మంగళవారంతో ముగిసింది. 10 రోజులుగా అర్చకులు తూకుంట లక్ష్మణశాస్త్రీ, శివయ్యల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



తిరువూరు శ్రీఅష్టలక్ష్మీ ఆలయంలో మహాలక్ష్మీదేవి అలంకారం

తిరువూరులో..

తిరువూరు: విజయదశమి పర్వదినాన్ని తిరువూరు పట్టణ ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. రామలింగేశ్వరాలయం, అష్టలక్ష్మీ ఆలయం, కనకదుర్గాలయం, గౌరీకేదారేశ్వరాలయం, పీటీ కొత్తూరు రామాలయం, చంద్రమౌళీశ్వరాలయాల్లో అమ్మవారికి విశేషాలంకారాలతో ప్రత్యేక పూజలు జరిగాయి. శమీపూజలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. తిరువూరు సాయిబాబా మందిరంలో సమాధి ఉత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

ఘనంగా సాయిబాబా సమాధి ఉత్సవం

గంపలగూడెం: షిరిడీ సాయిబాబా సమాధి ఉత్సవాన్ని గంపలగూడెం సాయిబాబా ధ్యాన నిలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని ప్రజలు సోమవారం దసరాను ఘనంగా జరుపుకున్నారు. బూరుగుగూడెం గ్రామంలో ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. చనుబండలో మహేంద్ర మేదర సంఘం ఆధ్వర్యంలో రంగుల విద్యుత్ దీపాలు, శక్తి వేషాలు, తీన్‌మార్ డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపును ఘనంగా నిర్వహించి నిమజ్జనం చేశారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: విజయదశమిని పురస్కరించుకుని మండలంలోని ప్రజలు మంగళవారం భక్తి శ్రద్ధలతో దుర్గమ్మ అమ్మవారిని పూజించారు. రెడ్డిగూడెంలోని రాజగోపాలస్వామి ఆలయంలో శరన్నవరాత్రులు పూజలు నిర్వహించి అనంతరం జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. తాడిగూడెం, మిట్టగూడెం, కొత్తనాగులూరు తదితర గ్రామాల్లో దసరా శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



మైలవరం కోట మహాలక్ష్మమ్మ ఆలయంలో శమీ పూజలో ఎమ్మెల్యే వసంత దంపతులు



రెడ్డిగూడెం మండలం మిట్టగూడెం సెంటర్లో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

కొండపల్లిలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): దసరా సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ కొండపల్లిలోని చెన్నకేశవ రామాలయం, అడపా వారి వీధిలోని ఆలయంలో ప్రత్యేక పూజల్లో సోమవారం రాత్రి పాల్గొన్నారు. రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గురవయ్య, శరభయ్య, వెంకయ్యనాయుడు, బ్రహ్మాజీ, పాలడుగు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. కిలేశపురం గంగానమ్మ ఆలయంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిపారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: మండలంలో దసరాను ఘనంగా నిర్వహించారు. గంపలగూడెం పోలీస్ స్టేషన్లో నిర్వహించిన దసరా ఉత్సవాలను ముగింపుగా ఎస్సై రాంబాబు ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: స్థానిక కనకదుర్గ దేవస్థానంలో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండలంలోని పుట్రేల గ్రామంలో ఉన్న మారెమ్మ దేవస్థానంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు ఎన్. అంజిరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కోటగిరి వెంకట సత్య శేష సునీల్ కుమార్, ఆలయ ఈఓ యడ్లపల్లి సీతారామయ్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మైలవరంలో..

మైలవరం: మైలవరంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రులు సోమవారం రాత్రి ఘనంగా ముగిశాయి. స్థానిక కోట మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ద్వారకా తిరుమల దేవస్థానముల చైర్మన్, మైలవరం జమీందారు రాజా ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ద్వారకా తిరుమల దేవస్థానముల వంశపారంపర్య ధర్మకర్త ఎస్వీ నివృతరావు ప్రత్యక్ష పర్యవేక్షణలో శమీ పూజ చేశారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, చివరి రోజు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ దంపతులు శ మీ పూజలో పాల్గొన్నారు. స్థానిక శివాలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఢిల్లీ నుంచి వచ్చిన అఘోరాలు కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.



నూజివీడు పురవీధులలో బుట్టబొమ్మల సందడి



గంపలగూడెం బాబా ధ్యాన నిలయంలో సమాధి ఉత్సవం

ఎ.కొండూరులో..

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు, రామచంద్రాపురం, ఎ.కొండూరు, కంభంపాడు, కృష్ణారావుపాలెం పలు గ్రామాల్లో ప్రారంభమైన శరన్నవ రాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కనకదుర్గమ్మ అమ్మవారికి రోజుకో అలంకరణ చేపట్టి పలు రకాల విశేష పూజలు నిర్వహించి భక్తులు ప్రసాదాలు స్వీకరించారు.

రాజరాజేశ్వరీ మాతా.. రక్షించు తల్లీ

బలివే (ముసునూరు): దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని సోమ, మంగళవారాల్లో మహిషాసరమర్దినిగా, రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరి అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. బలివేలోని ప్రసిద్ధ బలే రామలింగేశ్వరస్వామి ఆలయంతోపాటు, గోపవరం కాశీ విశ్వేశ్వరాలయం, మునుసూరు రైస్ మిల్లు సెంటర్, తూర్పు, పడమటి రామాలయాల వద్ద, చెక్కపల్లి, గుడిపాడు, వేల్పుచర్ల, రమణక్కపేటల్లోని శివాలయాల్లో అమ్మవారికి మహిళలు అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు.



మైలవరం కోట మహాలక్ష్మమ్మ ఆలయంలో పూజలు నిర్వహించిన మంత్రి జోగి రమేష్



పుట్రేల మారెమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు



బలివేలో ప్రత్యేక పూజలు



కొండపల్లి చెన్నకేశవ ఆలయంలో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్



నూజివీడు దసరా ఉత్సవాల్లో సీతారాముల వేషధారణలు



తిరువూరు షిరిడీ సాయిమందిరంలో సమాధి ఉత్సవం



నూజివీడులో ప్రత్యేక వాహనంపై ఊరేగుతున్న మహిషమ్మ

పోలియోను సమూలంగా నిర్మూలిద్దాం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ వ్యాప్తంగా పోలియోను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని రోటరీ మిడ్‌టౌన్ అధ్యక్షుడు సాధుప్రసాద్ తెలిపారు. అక్టోబర్ 24 ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా రోటరీ మిడ్‌టౌన్ అధ్వర్యంలో మంగళవారం పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహాత్మాగాంధీ రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి టీటీడీ కల్యాణ మండపం వరకూ నిర్వహించిన ఈ ర్యాలీని సాధుప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలియో దినోత్సవం సందర్భంగా.. నగరంలో పోలియో నిర్మూలన అవగాహన నడకను మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పోలియోపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు పోకూరి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి అజయ్, రోటరీ సభ్యులు, రోటరాక్ట్ సభ్యులు పాల్గొన్నారు.



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న రోటరీ మిడ్‌టౌన్ అధ్యక్షుడు సాధుప్రసాద్

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

నూజివీడు: మండలంలోని పల్లెర్లమూడిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు, గొల్లపల్లి, దిగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీచేస్తా

నూజివీడు: వచ్చే ఎన్నికల్లో నూజివీడు నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తానని మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య ప్రకటించారు. మండలంలోని సుంకొల్లులో సోమవారం మిత్రులు, శ్రేయోభిలాషులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009లో టీడీపీ అభ్యర్థిగా నూజివీడు నుంచి పోటీచేసి గెలుపొందానని, ఈ సారి స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలోకి దిగుతానని స్పష్టం చేశారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని పేర్కొన్నారు.

గోశాలకు రూ. 51వేల వితరణ

నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని గోశాల పై కప్పు పెంకు నిర్మాణానికి ఒక భక్తుడు రూ. 51వేలు వితరణగా ఇచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామవర ప్రసాదరావు తెలిపారు. తిరువూరు పట్టణానికి చెందిన చుండ్రుపట్ల నాగేశ్వరరావు, విజయలక్ష్మీ దంపతుల కుమారుడు అజయ్ మురారి ఈ మొత్తాన్ని అర్చకులకు అందజేశారు. దాతను అర్చకులు ఆశీర్వదించారు.

బతుకమ్మ వేడుకలు



గానుగపాడు(తిరువూరురూరల్): మండలంలోని గానుగపాడులో దసరా వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి బతుకమ్మ పండగ జరిపారు. గ్రామ సర్పంచ్ వేమిరెడ్డి కృష్ణవేణి ఆధ్వర్యంలో గ్రామమహిళలు, యువతులు బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు.

వివాహిత అదృశ్యం

పెనమలూరు: యనమలకుదురులో వివాహిత అదృశ్యమవటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన లక్ష్మీప్రసన్న కొన్నేళ్ల క్రితం దుర్గానాగేంద్రబాబును ప్రేమించి వివాహం చేసుకుంది. వీరికి ఒక కుమారుడు. ఆమె భర్త దురలవాట్లకు బానిసగా మారి కట్నం తీసుకురావాలని వేధించసాగాడు. సోమవారం భర్త మద్యం సేవించి వచ్చి భార్యను వేధించాడు. దీంతో భార్య లక్ష్మీప్రసన్న ఇంటి నుంచి అదృశ్యమైంది. ఆమె సమీపంలో ఉన్న బందరు కాలువలో దూకిందనే అనుమానంతో గాలిస్తున్నారు. ఘటనపై తల్లివిజయరత్నకుమారి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పాడి రైతులకు బోనస్



గన్నవరం: మండలంలోని దావాజీగూడెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాడి రైతులకు బోనస్ పంపిణీ చేశారు. మొత్తం 156 మంది రైతులకు రూ. 2.78 లక్షల బోనస్‌ను సంఘ అధ్యక్షుడు గొంది నరేంద్ర, రూట్ మేనేజర్ కె. ప్రసాద్ మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి సంఘం రూ. 4.98 లక్షలు నికర లాభం సాధించిందన్నారు. దీనిలో 70 శాతం బోనస్ రూపంలో పాడి రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. అత్యధికంగా గేద, ఆవు పాలు పోసిన రైతులకు బహుమతులను అందజేశారు. రూట్ సూపర్‌వైజర్ పి.యాసిన్, పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గొర్రెల మృతిపై బాధితుల ఆందోళన

మైలవరం: వాహనం ఢీకొని విలువైన గొర్రెలు మృతి చెందాయని, తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు విజయవాడ–ఛత్తీస్‌ఘడ్ జాతీయ రహదారి(30)పై సోమవారం రాత్రి ఆందోళనకు దిగారు. మైలవరం యాదవుల బజారుకు చెందిన పీ వెంకటేశ్వరరావు, బి.శివయ్య, సీహెచ్ శ్రీనివాసరావు, బి.నాగరాజు మరి కొంత మంది చంద్రగూడెం సమీపంలోని పొలాల్లో గొర్రెలను మేపుకుని తిరిగి ఇంటికి బయలు దేరారు. జాతీయ రహదారిలోని నాగేంద్రస్వామి ఆలయం వద్ద గొర్రెలను దారి మళ్లించే క్రమంలో రహదారి ఇరువైపులా ట్రాఫిక్‌ను ఆపి గొర్రెలను తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడకు చెందిన ఓ పోలీస్ వాహనం తిరువూరు వైపు వెళ్తుండగా గొర్రెలను ఢీకొంది. ఈ ఘటనలో నాలుగు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా మరో 15 గొర్రెలకు కాళ్లు విరిగాయి. దీంతో గొర్రెల యజమానులు రూ.లక్షల విలువ చేసే తమ గొర్రెలు చనిపోయాయని, తమకు న్యాయం చేయాలని కోరుతూ జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. ఎస్సై హరి ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో చర్చించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.